సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



గిఫ్ట్‌డీడ్ ఆక్రమణ

కొంగరకలాన్ రెవెన్యూ ప రిధిలోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో కబ్జా రాయుళ్లు రెచ్చిపోతున్నారు. 8లో▸



అర్ధరాత్రి తిరిగితే చర్యలు

నేరాల నియంత్రణకు అనుమానితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. 8లో▸



హామీల అమలులో విఫలం

హైడ్రా పేరుతో ప్రభుత్వం పేదల బతుకులను ఆగం చేస్తోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విమర్శించారు. 8లో▸

న్యూస్‌రీల్

పంచాయతీలకు రూ.7.48 కోట్లు

నిధులు విడుదల చేసిన రాష్ట్ర ఆర్థిక సంఘం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు రూ.7.48 కోట్లు మంజూరయ్యాయి. మూడు వేల జనాభా ఉన్న పంచాయతీలకు నిర్వహణ ఖర్చుల కింద నెలకు రూ.50 వేలు, ఎనిమిది వేల మంది జనాభా ఉన్న పంచాయతీలకు రూ.75 వేలు, అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.లక్ష చొప్పున విడుదల చేసింది. దీనిలో భాగంగా జిల్లాలోని 3,116 మంది పంచాయతీ సిబ్బందికి రూ.3.13 కోట్లు విడుదల చేసింది. పది పంచాయతీల్లో ట్రాక్టర్ లోను కిస్తీల చెల్లింపునకు రూ.3.11 లక్షలు, 446 పంచాయతీల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు రూ.40.43 లక్షలు మంజూరు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ తెలిపారు. ఆయా నిధులను పంచాయతీ కార్యదర్శుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు.

నేషనల్ అవార్డుకు గునుగల్ పేరు ప్రతిపాదన



రికార్డులను పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ శాఖ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ రవీందర్

యాచారం: నేషనల్ పంచాయతీ అవార్డుకు మండల పరిధిలోని గునుగల్ గ్రామ పంచాయతీని ప్రతిపాదించారు. జిల్లా లెవల్ కమిటీలో గునుగల్ గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా శనివారం పంచాయతీ రాజ్ శాఖ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ రవీందర్ గునుగల్ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ నరేందర్ రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ అయ్యప్ప, పంచాయతీ మండల అధికారి శ్రీలతతో కలిసి పంచాయతీ కార్యాలయంలో సమావేశమై సమీక్ష నిర్వహించారు. పంచాయతీకి వివిధ పద్దుల కింద మంజూరైన నిధులు, ఖర్చు చేసిన పద్ధతి, రికార్డుల నమోదు, గ్రామంలో నీటి సరఫరా తీరు, ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు.

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రభుత్వ భూమి అని తెలిసేలా బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ భూములు కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. కనకమామిడి రెవెన్యూ పరిధిలో కొందరు రియల్ వ్యాపారులు రూ.30 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి చుట్టూ ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు చేసి అందులో గదులు నిర్మిస్తున్నారన్న సమాచారంతో శనివారం అక్కడికి చేరుకున్నారు. డ్రోజర్లతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఆ స్థలంలో ప్రభుత్వ భూమిగా గుర్తించి సర్వే నంబర్ పేరుతో బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. 261 సర్వే నంబర్ పట్టా భూమి పేరు చెప్పి ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఐదెకరాల్లో లేఅవుట్ చేసి ప్లాట్లుగా అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని నిర్ధారించుకుని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కబ్జాకు యత్నించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఆక్రమణలకు ప్రయత్నిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజిత్, భాస్కర్ యాదవ్, భరత్‌యాదవ్, మహేశ్‌యాదవ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

కండల కోసం తప్పటడుగులు

సాక్షి, సిటీబ్యూరో: కండరాల తక్షణ పెరుగుదల కోసం వినియోగించే మెఫెన్‌టర్‌మైన్ ఇంజెక్షన్‌ను అక్రమంగా కొనుగోలు చేసిన నిందితుణ్ని హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అఫ్వాన్ 150 ఇంజెక్షన్లను కొనుగోలు చేశాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును మెహదీపట్నం జోన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు.



సర్దుబాటు.. కొరత తీరేట్టు

ఉపాధ్యాయుల మార్పులు చేర్పులు

- విద్యార్థుల నిష్పత్తి మేరకు అడ్జెస్ట్
- పాఠశాలల వారీగా విద్యాశాఖ సన్నాహాలు
- తీరనున్న విద్యార్థుల కష్టాలు
- మరింత నాణ్యమైన విద్య అందే అవకాశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే పాఠశాలల వారీగా పని చేస్తున్న ఉపాధ్యాయులు, చదువుతున్న విద్యార్థుల లెక్కలు తీసే పనిలో జిల్లా విద్యాశాఖ అధికారులు నిమగ్నమ య్యారు. దసరా సెలవులు ముగిసేలోగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని నిర్ణయించి, ఆ మేరకు వేగంగా చర్యలు చేపడుతున్నారు. ఒకవైపు 2008 డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేస్తూనే.. మరోవైపు ఉపాధ్యాయుల సర్దుబాటుకు చర్యలు చేపట్టారు.

సబ్జెక్టు టీచర్ల సమస్యకు పరిష్కారం

జిల్లాలో 1,319 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 6,525 పోస్టులకు ఆరు వేల మంది ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. వీరిలో 590 మంది స్థానికేతరులు ఉన్నారు. పని ఒత్తిడిని తప్పించుకునేందుకు విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండే.. ఇంటికి సమీపంలో ప్రభుత్వ స్కూళ్లలో పోస్టింగ్ పొందుతున్నారు. ఫలితంగా మెజార్టీ స్కూళ్లను సబ్జెక్టు టీచర్ల కొరత వేధిస్తోంది. డిప్యూటేషన్లపై వచ్చిన వాళ్లకు సబ్జెక్టుతో సంబంధం లేకుండా పోస్టింగ్‌లు ఇవ్వడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. సర్దుబాటు చేయడం ద్వారా సమస్యను కొంత వరకు పరిష్కరించే అవకాశం ఉంది. గతంలో 600 మందికిపైగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ అదే స్థాయిలో సర్దుబాటు జరిగే అవకాశం ఉంది.

ఈ మండలాల్లోనే అధికం

అబ్దుల్లాపూర్‌మెట్, తలకొండపల్లి, కొందుర్గు, యాచారం, కేశంపేట, కడ్తాల్, ఆమనగల్లు, చేవెళ్ల, షాబాద్ తదితర మండలాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. పాఠ్యాంశాలు బోధించే వారు లేకపోవడం, నాన్ సబ్జెక్టు టీచర్లు బోధించే పాఠ్యాంశాలు పిల్లలకు అర్థం కాకపోవడం, సిలబస్ కూడా సకాలంలో పూర్తికాక పోవడం వార్షిక పరీక్షల్లో ఫలితాలు తక్కువగా రావడానికి కారణాలుగా భావిస్తున్నారు. ఇకపై ఈ సమస్యలకు చెక్ పెట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం టీచర్ల సర్దుబాటుకు చర్యలు చేపట్టింది. మండలం, నియోజకవర్గం పరిధి దాటకుండా అదే ప్రాంతంలో ఉన్న మరో స్కూల్లో వీరిని కేటాయించనుంది. ఈ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టనుంది.

ప్రాథమిక పాఠశాలల్లో నిష్పత్తి ఇలా..

విద్యార్థులు	టీచర్లు
1-10	1
11-60	2
61-90	3
91-120	4
121-152	5
153-200	6

ఉన్నత పాఠశాలల్లో నిష్పత్తి ఇలా..

విద్యార్థులు	టీచర్లు
221-250	7
251-280	8
281-310	9
311-340	10
341-370	11
371-400	12
401-430	13
431-460	14
461-490	15
491-520	16
521-550	17
551-610	18
611-640	19
641-730	20
731-850	21
851-1000	22

పారదర్శకంగా పూర్తి చేస్తాం



విద్యార్థుల నిష్పత్తిని బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నాం. ఇందుకు సంబంధించి కలెక్టర్ శశాంక ఇటీవల ఎంఈఓలతో సమావేశం కూడా నిర్వహించారు. పాఠశాలల వారీగా ఉపాధ్యాయుల లెక్కలు తీస్తున్నాం. విమర్శలకు తావు లేకుండా పారదర్శకంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేస్తాం. సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చేసి, మంచి ఫలితాలకు కృషి చేస్తాం.

– సుశీందర్‌రావు, డీఈఓ



కేశంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

‘స్థానిక’ సమరానికి కసరత్తు

- పంచాయతీ కార్యాలయాల వద్ద ఓటరు జాబితాల వెల్లడి
- జిల్లాలో 549 పంచాయతీలు
- మొత్తం 7,94,651 మంది ఓటర్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పల్లె పంచాయతీకి సర్వం సిద్ధమైంది. రిజర్వేషన్లు ఖరారు చేయడం, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటమే ఆలస్యం.. ఆయా గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 549 పంచాయతీల్లో మొత్తం 7,94,651 మంది ఓటర్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. వీరిలో 3,99,404 మంది పురుషులు, 3,95,214 మంది మహిళలు, 33 మంది ఇతరులు ఉన్నారు. ఈ మేరకు శనివారం ఆయా పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో తుది ఓటర్ల జాబి తాను ప్రదర్శించారు. అత్యధికంగా మొయినాబాద్‌లో 60,495 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత చేవెళ్లలో 58,299 మంది, కందుకూరులో 50,769 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే ముసాయిదాపై వచ్చిన 10,441 ఫిర్యాదులను పరిష్కరించి తుది జాబితాను వెల్లడించినట్లు జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ తెలిపారు. ఇటీవల మున్సిపాలిటీల్లో విలీనమైన 12 గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాను వెల్లడించలేదు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్ర మహిళా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శోభారాణి

షాద్‌నగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర మహిళా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శోభారాణి అన్నారు. చిలుకూరు మహిళా ప్రాంగణం వారి ఆధ్వర్యంలో మూడు నెలలుగా షాద్‌నగర్ పట్టణంలో మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, కోర్సుల్లో శిక్షకురాలు అలియా సుల్తానా నేతృత్వంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ.. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా చైతన్యవంతులై అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. తమకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఒడిదొడుకులు ఎదురైనా వెనుకంజ వేయకుండా తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. మనం చేసే పని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. సమాజాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రతి మహిళ సమాజాన్ని నడిపించే శక్తిగా ఎదగాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల, చిలుకూరు మహిళా ప్రాంగణం మేనేజర్ శైలకుమారి, అలియాసుల్తానా, న్యాయవాది సబియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అతిథులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ

బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్

షాద్‌నగర్‌రూరల్: దేశంలోని దళితులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా పని చేస్తోందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. దళితులపై కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితులపై రాహుల్‌గాంధీ ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఆయనకు తెలియవని అన్నారు. దేశ ఖ్యాతిని దిగజార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అమెరికాలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా బీజేపీ పని చేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర క్యావర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సీమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు విఠ్యాల నర్సింహ, జిల్లా కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధి ప్రబలకుండా చర్యలు

సీడీఎంఏ ప్రిన్సిపల్ సెక్రెటరీ వి.పి.గౌతమ్

బంజారాహిల్స్: ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే రేబిస్ మరణాలు భారతదేశంలోనే ఎక్కువగా ఉన్నాయని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా రేబిస్ వ్యాధి ప్రబలకుండా, ఒక్క మరణం కూడా లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని సీడీఎంఏ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌతమ్ అన్నారు. వరల్డ్ రేబిస్ ప్రివెన్షన్ డే సందర్భంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ దగ్గర పలువురు మున్సిపల్ కమిషనర్లు రేబిస్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్‌తోపాటు హైదరాబాద్ బ్లూ క్రాస్ సంస్థ ఛైర్‌పర్సన్ అక్కినేని అమల కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వీధికుక్కలకు రేబిస్‌కు సంబంధించిన టీకాలు వేశారు. అనంతరం గౌతమ్ మాట్లాడుతూ 13 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగువేల శునకాలకు రేబిస్ వ్యాక్సిన్లు వేసినట్టు చెప్పారు. అమల మాట్లాడుతూ కుక్కలను చంపడం ద్వారా కాకుండా, వాటికి వ్యాక్సినేషన్ చేయడం వల్లనే రేబిస్‌ను నివారించడం సాధ్యమవుతుందని అన్నారు. వాటిపై దాడులు చేయడం ఆపి, వాటిని ప్రేమతో చేరదీయాలన్నారు. ఇప్పటికే వ్యాక్సినేషన్ చేసిన శునకాల చెవుల దగ్గర చిన్న వీ కటింగ్ ఉంటుందని, దానిని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.



కేబీఆర్ పార్కు వద్ద వ్యాక్సినేషన్‌లో పాల్గొన్న అక్కినేని అమల

పోషణమాసం.. ఆరోగ్యమే లక్ష్యం

- పౌష్టికాహార లోపం నివారణకు ఐసీడీఎస్ చర్యలు
- అంగన్‌వాడీల ద్వారా అవగాహన కార్యక్రమాలు
- గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందజేత



మక్తగూడ అంగన్‌వాడీలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది (ఫైల్)



అంగన్‌వాడీలో తయారు చేసిన పోషకాహారం

షాబాద్: మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఏటా సెప్టెంబర్‌లో పోషణ్ అభియాన్ మాసోత్సవం నిర్వహిస్తోంది. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తోంది. ఐదు శాఖల సమన్వయంతో ఐసీడీఎస్ ఈ కార్యక్రమం చేపడుతోంది. ఇప్పటికే ప్రారంభమైన అవగాహన, పౌష్టికాహారం పంపిణీ ఈనెల 30వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లాలో ఆమనగల్లు, చేవెళ్ల, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, శేరిలింగంపల్లి, షాద్‌నగర్‌లో మొత్తం ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పాలు, గుడ్లు, బాలామృతంతో పాటు వివిధ రకాల పౌష్టికాహారం అందిస్తున్నారు. మూడేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ ఎత్తు, బరువు ఏ విధంగా ఉందో తెలుసుకుంటున్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేయించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

పోషణ్ అభియాన్

ప్రస్తుతం తీసుకుంటున్న ఆహారంతో పిల్లలు, తల్లులు రక్తహీనత, పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. తక్కువ బరువుతో శిశువులు జన్మిస్తున్నారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం, పెరుగుదల, ఆటంకాలు, ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. పిల్లలు, తల్లులు ఆరోగ్యంగా ఉండటం కోసం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార లోపం అరికట్టేందుకు పోషణ్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఇంటింటికీ అంగన్‌వాడీలు

గర్భిణులు, బాలింతలు, పిల్లలు శారీరకంగా, మానసికంగా ఉండేందుకు అంగన్‌వాడీలు కృషి చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్నారు. ఎలాంటి ఆహారం తీసుకోవాలి.. ఏ జాగ్రత్తలు తీసుకోవాలి.. పిల్లలు బరువు తగ్గకుండా ఏం చేయాలో వివరిస్తున్నారు. చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో సీడీపీఓ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పౌష్టికాహారం ఇస్తున్నాం



గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నాం. నిర్దేశించిన విధంగా పోషకాహారం ఇస్తూ అంగన్‌వాడీల్లోనే తినేలా చూస్తున్నాం. క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు, పిల్లల బరువు, ఆరోగ్యాన్ని పరీక్షించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, మక్తగూడ

పకడ్బందీగా కార్యక్రమాలు



ప్రస్తుతం పిల్లల ఎదుగుదలకు పోషకాహార లోపం అనేది అవరోధంగా మారింది. తల్లిదండ్రులు పోషకాహారంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. విటమిన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా వాడాలి. పోషణ మాసోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.

– మీనా, అంగన్‌వాడీ టీచర్, సీతారాంపూర్

అవగాహన కల్పిస్తున్నాం



ఏటా సెప్టెంబర్‌లో పోషణ మాసం కార్యక్రమం ద్వారా ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటాం. తప్పనిసరిగా షెడ్యూల్ ప్రకారం పోషణ మాసం నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించాం.

– సృజన, ఐసీడీఎస్, షాబాద్ సూపర్‌వైజర్

జాగ్రత్తలు పాటించాలి



సరైన అవగాహన లేకపోవడం.. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో గర్భిణులు సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం లేదు. పిల్లలు అవయవ లోపం, తక్కువ బరువుతో పాటు చాలా రకాల ఆరోగ్య సమస్యలతో పుడుతున్నారు. అంగన్‌వాడీల్లో ఇస్తున్న పోషకాహారం తల్లీబిడ్డకు చాలా శ్రేష్ఠం.

– రమాదేవి, ఐసీడీఎస్, సూపర్‌వైజర్

పంచలోహ విగ్రహాలు మాయం

ఇబ్రహీంపట్నం: పంచలోహ విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. ఎలిమినేడు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారామాంజనేయ పంచలోహ విగ్రహాలను దొంగిలించారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

కేశంపేట: ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు బైక్‌లు ఢీ కొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని బోధునంపల్లి శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. పుట్టోనిగూడ పంచాయతీ పరిధిలోని కాంకిరాళ్లతండాకు చెందిన రమేశ్ బైక్ భార్య పద్మ, కుమారుడితో కలిసి నిర్దవెల్లిలో ఆస్పత్రికి వెళ్తున్నాడు. అదే సమయంలో కేశంపేటకు చెందిన గుంటి యాదయ్య తన బైక్‌పై కేశంపేట వైపు ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో బోధునంపల్లి గేట్‌వద్ద బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో యాదయ్య, పద్మ తీవ్రంగా గాయపడగా రమేశ్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను షాద్‌నగర్, శంషాబాద్ ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు.

కుటుంబ కలహాలతో మనస్తాపం

మద్యం మత్తులో పురుగుమందు తాగిన వ్యక్తి మృతి


నర్సింహ (ఫైల్)

కేశంపేట: కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి మద్యం మత్తులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని దత్తాయపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... మాజీ సర్పంచ్ అలివేలు భర్త మామిడిపల్లి నర్సింహ (35) మద్యానికి బానిసయ్యాడు. గ్రామస్తుల వద్ద డబ్బులు అడుగుతూ మద్యం తాగుతుండే వాడు. ఇదే విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగి ఈ నెల 17న అలివేలు గంగన్నగూడెంలోని చిన్నమ్మ ఇంటికి వెళ్లింది. దీంతో ఈ నెల 27న నర్సింహ పురుగు మందు తాగడంతో గమనించిన స్థానికులు ఆస్పత్రికి తలరించగా అప్పడికే మృతి చెందినట్లు వెల్లడించారు. విషయం తెలుసుకున్న అలివేలు వెంటనే గ్రామానికి చేరుకుంది. ఈ మేరకు శనివారం మృతుడి భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

గిఫ్ట్ డీడ్.. ఆక్రమణ

- మున్సిపాలిటీ స్థలాన్ని కబ్జాచేసిన వైనం
- రూ.3 కోట్ల విలువైన 668.31 గజాల స్థలం అన్యాక్రాంతం
- ప్రహరీ నిర్మించి.. చెట్లతో కనిపించకుండా కమ్మేసి
- పట్టించుకోని అధికారులు


కొంగరకలాన్‌లో మున్సిపల్ భూమిలో ప్రహరీ కట్టి ఆక్రమించిన కన్వెన్షన్ యాజమాన్యం


గోడ కనిపించకుండా నాటిన మొక్కలు

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్ రెవెన్యూ పరిధిలోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో కబ్జా రాయుళ్లు రెచ్చిపోతున్నారు. కబ్జాలకు కాదేదీ అనర్హం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేసిన భూమిని కబ్జా చేశారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొంగరకలాన్ లిమిట్స్‌లో నిర్మించిన ఓ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు హెచ్ఎండీఏ ప్లాన్‌లో భాగంగా రోడ్లు, పార్కింగ్ ఏరియాలను స్థానిక ఆదిబట్ల మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేశారు. 2021 డిసెంబర్ 24న 668.31 గజాల స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారుల చేత ధ్రువీకరించిన (20644- 2021 డాక్యుమెంట్ నంబరు) పత్రాలను సైతం ముట్టజెప్పారు. ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తయ్యే వరకూ సైలెంట్‌గా ఉన్నారు. అనంతరం ఏడాది తిరగకముందే సర్వే నంబరు 388, 389, 390లలోని 668.31 గజాల భూమిని కబ్జా చేశారు. ఇందులో ఏకంగా 500 మీటర్ల పొడవు, ఆరు ఫీట్ల ఎత్తుతో రోడ్డును నిర్మించారు. ప్రభుత్వ స్థలంలో గోడలు నిర్మించడం నేరమని తెలిసినప్పటికీ యథేచ్ఛగా తమ పని కానిచ్చేశారు. అక్రమంగా నిర్మించిన గోడ బయటకు కనిపించకుండా దట్టంగా చెట్లు నాటారు. ఇదేమిటని అడిగినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ స్థలం విలువ గజానికి రూ.50 వేలు పలుకుతోంది.

పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు..

మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసిన విలువైన భూమి కబ్జాకు గురైందని స్థానిక కొంగరకలాన్ పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఫంక్షన్ హాల్ యాజమాన్యంతో కుమ్మక్కయ్యారని విమర్శిస్తున్నారు. ఈ విషయమై ఓ కౌన్సిలర్ నేరుగా అనేక మార్లు చెప్పినప్పటికీ, దరఖాస్తు రూపంలో ఫిర్యాదు చేసినా పెడచెవిన పెడుతున్నారని చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో శ్లోక యాజమాన్యం మున్సిపల్ భూమిని కబ్జా చేయడంతో ప్రహరీ నిర్మించింది వాస్తవమే. ఈ విషయమై ఇప్పటికే రెండు సార్లు టౌన్‌ప్లానింగ్ అధికారులను పంపించి పరిశీలించాం. ప్రభుత్వ ఆస్తిని తప్పకుండా ఆస్తిని కాపాడుతాం. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం.

– బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఆదిబట్ల

చెవులు కోసి.. ప్లాస్టిక్ కవర్లో మూటకట్టి

మహిళను హత్య చేసిన గుర్తు తెలియని వ్యక్తులు


లక్ష్మి మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: బంగారు ఆభరణాలకోసం చెవులు కోశారు.. ఆపై హత్యచేసి ప్లాస్టిక్ కవర్‌లో మూటకట్టి మృతదేహాన్ని రోడ్డు పక్కన పడేశారు.. ఈ దారుణ ఘటన పట్టణంలోని శ్రీనివాస కాలనీలో శనివారం వెలుగుచూసింది. సీఐ విజయ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన కన్న భాగ్యలక్ష్మి అలియాస్ లక్ష్మి(40), వెకంటయ్య దంపతులు. వెంకటయ్య రెండో భార్యతో గ్రామంలో నివసిస్తుండగా.. మొదటి భార్య లక్ష్మి కూలీగా పనిచేస్తూ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో అద్దె ఇంట్లో ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు లక్ష్మిని హత్య చేసి చెవులు కోసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. అనంతరం మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్లో మూటగట్టి శ్రీనివాస కాలనీలో రోడ్డు పక్కన పడేశారు. గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రంగస్వామి సీఐ విజయ్‌కుమార్‌తో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. కవర్ విప్పి చూడగా మహిళ మృతదేహం కనిపించింది. క్లూస్‌టీం ఆధారాలు సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన మహిళ ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. మృతురాలు ముష్టిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మిగా పోలీసులు గుర్తించారు. శ్రీనివాస కాలనీవాసి మహ్మద్ సాదిక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్ధరాత్రి రోడ్లపై తిరిగితే చర్యలు

- ఆపరేషన్ చబుత్రా చేపడతాం
- మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి


వాదే సాల్హె హీన్ బస్తీలో పర్యటిస్తున్న ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి

పహాడీషరీఫ్: నేరాల నియంత్రణకు అనుమానితులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాదే సాల్హె హీన్ బస్తీలో శుక్రవారం రాత్రి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఇన్‌స్పెక్టర్ టి.భూపతి, ఎస్సైలు, ప్రత్యేక బృందాలు కలిసి బస్తీలో కలియ తిరుగుతూ అనుమానితులు, రౌడీషీటర్ల వివరాలు సేకరించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో చాలా బస్తీలలో యూపీ, బీహార్ యువకులు తరచూ గొడవలకు దిగుతూ... ఒక్కోసారి స్థానికులతో కూడా వివాదాలు నెలకొంటున్న సందర్భాలుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు బస్తీలలో గస్తీ నిర్వహిస్తున్నామని ఏసీపీ తెలిపారు. రాత్రి పూట బస్తీలలో అకారణంగా తిరిగినా, చబుత్రాలపై తిష్టవేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఐ మధు, ఎస్సైలు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: హైడ్రా పేరుతో ప్రభుత్వం పేదల బతుకులను ఆగం చేస్తోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విమర్శించారు. శనివారం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. హామీల అమలులో విఫలమైన ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి వాటిని మరిచిందన్నారు. 70లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉండగా కేవలం 18లక్షల మందికి రైతులకు మాఫీ చేసి చేతులు దులుపుకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన రైతులందరికీ వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన పేరిట దాదాపు 16వేల ఇళ్లను కూల్చేసేందుకు సిద్ధమయ్యారని వారికి ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు జోగు వీరయ్య, లచ్చిరాంనాయక్, కదారి రామకృష్ణ, గంప శ్రీను, హర్యానాయక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సర్వీస్‌లను వినియోగించుకోవాలి

రంగారెడ్డి రీజియన్ ఏటీఎం రవీందర్


తొర్మామిడిలో లాజిస్టిక్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న రవీందర్

బంట్వారం: ఆర్టీసీ లాజిస్టిక్ విభాగం సర్వీస్‌లను వ్యాపారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి రీజియన్ ఏటీఎం రవీందర్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని తొర్మామిడిలో ఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఇప్పటికే వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల పరిధిలోని పలు ప్రాంతాల్లో లాజిస్టిక్ కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. వ్యాపారుల సౌకర్యార్థం గ్రామీణ ప్రాంతాల్లోనూ లాజిస్టిక్ కౌంటర్లను విస్తరింపజేస్తున్నామన్నారు. ఈ సర్వీసులను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. సర్వీస్‌లతో వ్యాపారుల పార్సిల్స్ వేగంగా భద్రంగా తక్కువ ఖర్చుతో అందజేస్తామన్నారు. మరింత సమాచారం కోసం వికారాబాద్ జిల్లాలోని మార్కెటింగ్ లీడర్స్ కౌంటర్ ఏజెంట్స్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిపో ఇన్‌చార్జి వసంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

400 మందికి ఉద్యోగాలు



మైలార్‌దేవ్‌పల్లి: మెగా జాబ్ మేళా ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని మహావీర్ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 50 ప్రముఖ కంపెనీల వారు ఎంపికైన విద్యార్థులకు జాబ్ కల్పించారు. 1000 మంది విద్యార్థులలో 40శాతం విద్యార్థులు వివిధ కంపెనీలలో ఎంపిక కావడం పట్ల కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సంరెడ్డి విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.